
# ఊరిని మర్చిపోగాకు అబ్బీ!

**- వేంపల్లి గంగాధర్**



**ముసురుకమ్మిన సాయంకాలపు అరుగు మీద పక్షుల్లా ఎగురుతూ ఆడుకునే పిల్లల నవ్వుల మధ్య నా బాల్యం కన్పిస్తుంది... ఆకాశంలోని నీలి మేఘాల్ని నేలకు దించే పనిలో నిమగ్నమైనట్లు రెండు చేతుల్తో దారాన్ని నరిచేస్తూ గాలి వాటాన్ని బట్టి పటాన్ని నరిచేస్తూ ఎదురుగాలికి పైకి లేస్తూ నీలాకాశంలోకి ఆశల కెరటంలా దూసుకుపోవడానికి ప్రయత్నిస్తున్న గాలిపటాన్ని మొండికెగరేస్తున్న పిల్లాడి తాపత్రయంలో నా చిన్ననాటి జ్ఞాపకాలు... ఆకురాలు కాలంనుంచి ఆమనిలోకి ఋతువొకటి తర్జుమా అయ్యే శబ్దం...**

మా ఊరు... పల్లెటూరు... ఒంటెద్దు బండి పైకెక్కి కాలువ కట్టపైనుంచి ఊర్లోకి సాగిపోతే... ఒక్కొక్కటిగా ఆవిష్కారమయ్యే స్మృతులు... మట్టిమీద నడవడం మొదలు... మట్టిలో కలవడంవరకు మధ్యలోదే జీవితమా... ఎలా బతికామో తెలియకుండానే ఒక జీవితకాలం దాటేస్తున్నాం. ఎంత దుఃఖించినా నీడ తడవదు కదా!

నీడ...

నన్ను నడిపించిన నీడ... నా చిటికెన వేలు పట్టుకొని జీవితాన్ని గమనించమని లోకంలోకి నడిపించుకొచ్చిన ఆధారం. నేను కాళ్ళ నొప్పులని అంటే భుజాలమీదకెత్తుకొని భారాన్ని కూడా బాధ్యతగా మోసిన మహానుభావుడు... ఆడుకుంటానంటే గుర్రమయ్యే ఆట వస్తువులా, ఏడుస్తుంటే ఆట బొమ్మలా, చీకట్లో నేనుండిపోతే వెలిగే మైనం వొత్తిలా...

తను కరిగిపోతూ నాకు కాంతిని పంచుతూ...

పలక మీద నేను రాసుకునే అక్షరాలకు తను సుద్ధ ముక్కలా అరిగిపోతూ.. నాకోసం... నా భవిష్యత్ కోసం తరిగిపోతూ... తోడుగా, నీడగా... భారమైనప్పుడు కాసిన్ని కన్నీళ్ళు తుడవడానికి... చెప్పుకోవడానికి... తల వాల్చడానికి ఒక భుజంలా- నాన్న!

నిన్ను ఎన్నిసార్లు గుర్తుచేసుకున్నా నువ్వు లేవు కదా నాన్న... నేను ఏమైపోతానో అని ఎంతగా దిగులు పడ్డావు... నా భవిష్యత్‌కోసం ఎన్నెన్ని కలలు కన్నావు... నీ గురించి, నీ జీవితం గురించి రవ్వంతైనా ఆలోచించకుండా... నాకోసం ఎంతగా పరితపించావు...

❖ ❖ ❖

నేలను నమ్ముకున్న రైతు మా నాన్న.

వీరాపురంలో తూరుపు దిక్కున దేవళంబజారులో మా ఇల్లు.

ఇంటిముందు గన్నేరు పూల చెట్టు వుంటుంది. దానికి కాస్త పక్కనే గిలక బావి. ఆ దారి వెంబడి అలాగే ముందుకు సాగితే కోదండ రామాలయం.

మా వూరు అచ్చం ప్రకృతి గీసిన వర్ణచిత్రంలా వుంటుంది.

ప్రతి రాత్రి నన్ను నిద్రపుచ్చడానికి ఎన్నెన్నో కతలు చెప్పేవాడు. చందమామ కతల్నుంచి సాహసవీరుడు సింగన్న రాజు కతల వరకు ప్రతిరోజూ ఏదో ఒక కత నన్ను జోకొడుతూ చెప్పేవాడు. మాట్లాడే చెట్టు కత, గుర్రం పైన పోయే మాంత్రికుడి కత, పుట్టలోని పాము కత, చెట్టులోని పక్షి కత... ఎన్నెన్నిసార్లు చెప్పాడో. ఇప్పటికీ నాకు ఆ కతలన్నీ గుర్తుకొస్తూనే వుంటాయి.

ఉదయాన్నే లేచి అన్నం వండి గుడిలోని మండపంలో బడికి నా చిటికెన వేలు పట్టుకొని పిల్చుకపోయేవాడు. 'తప్పు రాస్తే కొట్టగాకు సామీ' అని విన్నవించుకొని ఆప్యాయంగా నన్ను ఒడిలో కూర్చోబెట్టి పొలం వైపునకు వెళ్ళిపోయేవాడు. ఉరిమి చూసే కళ్ళుగానీ... బెదిరించే బెత్తం గానీ ఆయనకు ఇష్టం వుండేవి కావు.

> 'యేం జేసేది పెద్దాయన... ఆ దావ పక్కన వుండేదంతా నీ భూమే. నువ్వు ఒప్పుకుంటేనే కదా ఊరికి ఆసుపత్రి వచ్చెది. బస్టాండు కట్టెది. ఊరుకోసం నువ్వు స్థలమిస్తే నేను దగ్గరుండి కట్టిస్తా... మనూరు గూడా మొగోడుతిన్న మీసం దువ్వాల..'

నాన్న యింకేం చేశాడు... ఊరుకున్నాడా... ఊరి బాగుకోసం నడుం కట్టాడు.

పెద్ద తాత... వీరయ్య తాత ఇంటికెళ్ళాడు... ''ఏరా... అబ్బీ... కూర్చో... ఎట్టుండావు ఏంది... దిగదాల ఇండ్ల దిక్కుకు రాకుండానే మానుకున్నావు..' నులక మంచం లోంచి పైకి లేస్తా అడిగినాడు వీరయ్య తాత.

'లేయ్యాకు తాత... నేను ఈ వసరాలో కట్టమీద కూర్చుంటాగానీ' జవాబిచ్చాడు నాన్న. నాన్నను చూసినాక తాత ఎంత సంబరపడ్డాడో... ఆమాట ఈమాట మాట్లాడుకున్నాక అసలు సంగతిని చిన్నగా ఎత్తిడిసినాడు నాన్న.

'అనుకున్నారా... అబ్బిగా... నువ్వు నా దగ్గరికి వచ్చినావంటే వూరికే రావు... యాదో వొకటి నెత్తిమీద పెట్టుకునే వచ్చింటావు...' అన్నాడు నవ్వుతా తాతా.

'యేం జేసేది పెద్దాయన... ఆ దావ పక్కన వుండేదంతా నీ భూమే. నువ్వు ఒప్పుకుంటేనే కదా ఊరికి ఆసుపత్రి వచ్చెది. బస్టాండు కట్టెది. ఊరుకోసం నువ్వు స్థలమిస్తే నేను దగ్గరుండి కట్టిస్తా... మనూరు గూడా మొగోడుతిన్న మీసం ధువ్వాల..' అన్నాడు నాన్న గర్వంగా.

'ఊరు బాగు పడ్తాదంటే నాకంటే ఆనందంచే నా కొడుకు యింగెవడుంటాడు? స్థలానికి అడ్డమేముండాది? తీసుకోపోండి... పనులు చేసుకోపోండి...' తల వూపుతా చెప్పినాడు తాత.

ఇంతలో తాత పెద్దకొడుకు ఇంట్లోకి వచ్చినాడు.

'గవర్నమెంటోళ్ళకు స్థలం వూరికే ఎందుకిస్తాం? సంపాదించుకున్నది దానం చేయడానికా... ఊరు సంగతి మాకొద్దు... మా స్థలం జానుడు కూడా యియ్యం...' అని కోపంతో నాన్న మీదికి వచ్చినాడు.

'మనం మంచి స్థలం గవర్నమెంటుకు చూపించక పోతే మంజూరైన ఆసుపత్రి, బస్టాండులు నిర్మాణం కావు. ఊరికి ఆసుపత్రి అవసరం ఎంతో వుంది. మొన్న సావిత్రవ్వ మొండి జ్వరంతో ప్రాణాలు విడిసింది. నిన్నటికి నిన్న సాంబశివుడు పాముకరిచి పొలం గట్టుకాడ్నే తెల్ల నురగ కక్కుకొని చచ్చిపాయె... ఆసుపత్రి వస్తే అందరికి బాగుంటాది...' అని నాన్న మొత్తుకొని మొత్తుకొని చెప్పినా తాత పెద్దకొడుకు వినలేదు.

నాన్న యింగేం చేస్తాడు?

యేటి గట్టున్న వరి పండే పన్నెండు ఎకరాలు అమ్మి ఆ లెఖ్ఖతో వీరయ్య తాత పెద్ద కొడుకు దగ్గర్నుంచి స్థలం కొనాల్సి వచ్చింది.

ఆ లెఖ్ఖను తీసుకున్నందుకు కొడుకు మీద వీరయ్య తాతకు భరింపరాని కోపం, అసహ్యం వేశాయి. దగ్గరికి పిలిచి ముఖాన కాండ్రించి 'థూ' అని ఎంగిలి మూసి కసి తీర్చుకున్నాడు.

నాన్న సంపాదించుకున్నదంతా ఊరికోసమే ఖర్చుపెట్టెవాడు. చూస్తుండగానే ఊర్లో రోడ్డుపక్కనే ఆసుపత్రికి గోడలు లేచాయి. బస్టాండు నిర్మాణం అయ్యింది. చివరాఖరికి వీరయ్య తాత పెద్దకొడుకు కూడా ఎడ్లబండిపై నుంచి కిందపడి కాలు విరిగినప్పుడు ఆ ఆసుపత్రిలోనే వైద్యం తీసుకున్నాడు.

నాన్న ఎప్పుడు ఖాళీగా వున్నాడు? ఎప్పుడూ ఊరి గురించే... ఊరి బాగు గురించే... ఎప్పటినుంచో పట్టించుకోని ఊర్లోని రాయలకాలంనాటి చెరువుపైకి దృష్టి మళ్ళించాడు. చెరువు గట్టు నిర్మాణం, కాల్వల పునః నిర్మాణం, పూడిక తీత పనులన్నీ చేయడానికి నడుం బిగించాడు. ఒక మంచిరోజున తానే పలుగూ పార తీసుకొని మొదటి అడుగువేశాడు. ఊరు పచ్చగుండాలంటే చెరువు బాగుచేసుకోవాలని పిలుపునిచ్చాడు.

నాన్న వెనుక ఊరు ఊరంతా కదిలింది. చిన్నా పెద్దా ముసలీ ముతక భేదం లేకుండా చెరువు నిర్మాణంకోసం రాళ్ళు మోశారు. పూడిక తీశారు. అంతవరకు ఊర్లో చెరువువున్నా లేనట్లుగా వుండేది. నాన్న ప్రయత్నంతో చెరువు రూపుదిద్దుకుంది. వర్షాలు పడి చెరువునిండి రైతుల పంట పొలాలు పచ్చని సంగీతాన్ని ఆలపించాయి. ఎలా వుండేది మా ఊరు... ఆటలు... పాటలు... అరుపులు... నవ్వులు... పువ్వులు... అరకలు... మెరకలు... కాడెద్దుల మెడ గంటలు... గిలక బావి చప్పుళ్ళు... పండగలు... పబ్బాలు... రచ్చబండ మీద సందడి... జక్కీలు, కోలాటాలు, పండరి భజనలు, ఉత్సవాలు... ఉత్సాహాలు ఎన్నో! ఎన్నెన్నో!!

'ఓరే అబ్బీ... నువ్వు కష్టపడి చదువు. గవర్నమెంటు ఉద్యోగం రావాల. మన దగ్గర సంపాదించింది యేం లేదు. నీమీదే నా ఆశ. బాగా చదువుకో. పేరుతెచ్చుకో. ఊరిని మర్చిపోగాకు.' అని ఎప్పుడూ చెప్తుండే నాన్న నన్ను గుండెల్లో పెట్టుకొని చదివించాడు.

నేను పెరుగుతున్నకొద్ది నేల ఎండడం మొదలైంది. పండడం ఆగింది. కరువు కమ్ముకుంటా నాతోపాటూ పెరుగుతా వచ్చింది.

నన్ను పట్నంలోని కాలేజీలో చేర్చాడు.

మరో నాలుగు ఎకరాలు అంకిరెడ్డికి అమ్మాడు.

నాకు పరీక్ష ఫీజు కట్టాల్సి వచ్చింది.

ఎక్కడ్నుంచో నాలుగువేలు అప్పుతెచ్చాడు.

నేను రెండో సంవత్సర కోర్సులోకి చేరాను.

ఇంటి దగ్గరి ఎడ్లు కన్పించలేదు.

నేను మూడో సంవత్సర కోర్సులోకి వచ్చాను.



'ఓరే అబ్బీ... నువ్వు కష్టపడి చదువు. గవర్నమెంటు ఉద్యోగం రావాల. మన దగ్గర సంపాదించింది యేం లేదు. నీమీదే నా ఆశ. బాగా చదువుకో. పేరుతెచ్చుకో. ఊరిని మర్చిపోగాకు.'

ఇల్లు కన్పించలేదు.

సంవత్సరం పరీక్షలు అయ్యాక వూరికెళ్ళాను.

నాన్న దిగడాల కొట్టంలోకి తీసుకెళ్ళాడు.

'ఏంది నాన్న ఈ కష్టాలు అని' కన్నీళ్ళు పెట్టుకున్నాను.

'చాల్లే పాపోడా... ఊరుకోసం బతికేటోళ్ళం. మనమంటే అందరికి మంచి మర్యాద వుండాది. మనల్ని చూస్తే చేతులెత్తి ముక్కుతా వుండారు. మనం పదిమందికి మంచి చేయాల. డబ్బుదేముంది మళ్ళానైనా సంపాదించుకోవచ్చు. నువ్వు పట్నంలోనే చదువు...' అని ఓదార్చి ధైర్యం చెప్పాడు.

'నన్ను చూడను నువ్వు పల్లెకు రావాకు... వస్తే బాధ పడతావుంటావు. నేనే వారానికొకసారి పట్నమొస్తానని' నాన్న ఊరడించాడు. అప్పటినుంచి నాన్నకోసం ప్రతి ఆదివారం ఎదురుచూసేవాడ్ని. అరిగిపోయిన చెప్పులు తొడుక్కొని, చేతిలో సంచితో నన్ను చూడ్డంకోసం వచ్చే నాన్నకోసం ఆదివారంనాడు గేటుకేసి చూస్తూ కూర్చొనేవాడ్ని. నాన్న వచ్చినరోజు పండగొచ్చినట్లుండేది.

నా చేతిలో పచ్చింకి పెన్నుండాలని ఎన్నెన్ని కలలు కన్నాడు. నా పచ్చింకి సంతకంతో ఎందరో తలరాతల్ని మార్చాలని, ఎందరో జీవితాల్ని తీర్చిదిద్దాలని ఎన్నెన్నో కలలుకన్న నాన్న ఓరోజు... బరువైన గుండెపోటుతో... నన్ను వదలి వెళ్ళిపోతే... ఎలా తట్టుకోగలను?... కళ్ళు కన్నీటి సముద్రాలు కాలేదు!

❖ ❖ ❖

నాకోసం కష్టించిన నాన్న... నువ్వు అనుకున్నట్లు నువ్వు కలలుగన్నట్లు ఈరోజు నేను పచ్చింకి సంతకం పెట్టే ఉద్యోగంలో వున్నను నాన్న... చూడ్డానికి నువ్వు లేవు నాన్న... పొలాన్ని సాకినట్లు నన్ను... గుండెల్లో పెట్టుకొని చూసుకున్న నాన్న... నాకోసం ఎంత కష్టపడ్డావు... ప్లీజ్ మళ్ళీ ఓసారి రా... నాన్న... ఇప్పుడు అన్నంకోసం మనం యిబ్బంది పడాల్సిన పనిలేదు. ఖరీదైన కారు యిదిగో నాన్న... బంజారా హిల్స్‌లో ఖరీదైన బంగ్లా కొన్నాను రా... నాన్న... అరిగిపోయిన చెప్పుల జీవితం... నలిగిపోయిన బట్టలు వద్దు నాన్న... దేవుడు కరుణించాడు నాన్న! వర్షానికి కారే బోద కొట్టం... వెంటపడి వేధించే అప్పులవాళ్ళు... ఈ కష్టాలన్నీ నీకుండవు. నాదగ్గర నువ్వుంటే చాలు నాన్న!

పల్లెలో ఇప్పుడు...

మనం అమ్ముకున్న భూములన్నీ మనమే కొనుకున్నాం.

మన ఇల్లు మనకుంది. మనకున్న మర్యాద మనకుంది.

నీ కొడుకునని చెప్పుకోడానికి గర్వపడ్తున్నాను.

చచ్చేవరకు ఊరి బాగుకోసం శ్రమించిన నీ ఘనతను ఊరంతా చెప్తుంటే విని పులకరిస్తున్నాను.

చివరి సాయంకాలపు తొలి చీకటి తెరలోంచి మెల్లిమెల్లిగా నువ్వు అదృశ్యమవడాన్ని నా చిన్ని గుండె ఎలా తట్టుకోగలదు నాన్న...

నీ అడుగు జాడల జ్ఞాపకం కెరటాలు కెరటాలుగా గుర్తుకొచ్చి సముద్రంలా రోధిస్తాను. నువ్వు తోడుగావుంటే ఇద్దరం కలిసి అంబరాన్ని తాకే సంబరాలు చేసుకునేవాళ్ళం... శూన్య ఆకాశంనుంచి కొన్ని చుక్కల్ని రాల్చుకొచ్చి ఇక్కడ కట్టుకున్న ఇసుక గూళ్ళకు కుదురుగా అలంకరించి సంబరపడేవాళ్ళం...

నాన్న...నువ్వెప్పుడు చెప్తుండేమాట 'ఊరిని మర్చిపోగాకు రబ్బీ...' నాకెప్పటికీ గుర్తుకొస్తూనే వుంటుంది. అందుకే మనూరికే నేను బదిలీపై వస్తున్నాను నాన్న... నీ ఆశయాలను ఆకాంక్షలను నెరవేర్చడానికి పూనుకుంటాను. నీ చిటికెన వేలు పట్టుకొని బడివైపునకు నడుస్తున్నట్లే వుంది యిప్పటికీ... జ్వరమొచ్చినప్పుడు నుదుటిపైన నువ్వేసిన చల్లటి చెయ్యి జ్ఞాపకమొస్తుంది... దిగులుగా వుంది నాన్న... కాసేపు ఓదార్చు... దీవించు... చెయ్యి వదలకు నాన్న ప్రాణం పోతున్నంత బాధగా వుంటుంది.

వెళ్తున్నాను... వెళ్తున్నాను... ఊరిని మర్చిపోను...

వెళ్తున్నాను... యిప్పుడే.. నీకోసం!

మన ఊరికి! ★